క్లుప్తంగా

31 నుంచి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర పాశుపత భువనేశ్వరి యాగం



బయ్యన్నగూడెంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

కొయ్యలగూడెం: బయ్యన్నగూడెంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 31 నుంచి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర పాశుపత సహిత భువనేశ్వరి యాగం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త బాలం దత్తుడు తెలిపారు. ఏప్రిల్ 3వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు యాగం నిర్వహిస్తున్నామన్నారు. యాగంలో పాల్గొనదలచిన భక్తులు 99120 10345, 73966 84322 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సీపీఎం చైతన్య యాత్ర



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం జిల్లా సభ్యురాలు నాగమణి

కొయ్యలగూడెం: సీపీఎం ప్రజా చైతన్య యాత్ర ఆదివారం పరింపూడి ఎస్టీ యానాది పేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, రోడ్లు, అధిక ధరలు, విద్యుత్ చార్జీలు, డ్రెయినేజీ సమస్యల మీద సతమతమవుతున్నామని ప్రజలు ఆమె వద్ద మొర పెట్టుకున్నారు. ఈ నెల 25వ తేదీన సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద వినతిపత్రాలు ఇచ్చేందుకు ప్రజానీకం అంతా తరలిరావాలని సీపీఎం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఎస్.శివకుమార్, ఎం.సుబ్రహ్మణ్యం రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: డ్రెయినేజీ విషయంలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో మహిళపై నలుగురు దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండలంలోని మైసన్నగూడెంకు చెందిన జుత్తుక రమణకు, అదే గ్రామానికి చెందిన జుత్తుక గంగారత్నంకు డ్రెయినేజీ విషయంలో గొడవలు ఉన్నాయి. గత నెల 27వ తేదీన రమణ డైపర్లను డ్రెయినేజీలో వేయగా, గంగారత్నం ఎందుకు వేశావని ప్రశ్నించింది. దీంతో రమణ, మరో ముగ్గురు కలిసి గంగారత్నంను కొట్టి, అసభ్యకరంగా ప్రవర్తించారు. విషయాన్ని పెద్దల్లో పెట్టగా పరిష్కారం లభించకపోవడంతో గంగారత్నం ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వయోజనులకు ఉల్లాస్ పరీక్ష

భీమడోలు: మహిళల్లో అక్షరాస్యతను పెంపొందించేందుకుగాను ఆదివారం నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండల పరిధిలోని 20 అభ్యాసన కేంద్రాల్లో 250 మంది ద్వారా మహిళలకు శిక్షణ పొందారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని భీమడోలు, గుండుగొలను, సూరప్పగూడెం, కుర్గెల్లగూడెం గ్రామాల్లో రెండేసి చొప్పున కేటాయించిన 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. వాటిలో 250 మంది మహిళలు పరీక్షలు రాయాల్సి ఉండగా నూరు శాతం పరీక్షలకు హాజరయ్యారు. కుర్గెల్లగూడెంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్షల నిర్వహణ తీరును డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ పరిశీలించారు. గుండుగొలను పాఠశాలలోని పరీక్షను ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ పరిశీలించి ఇన్విజిలేటర్లకు పలు సూచనలందించారు. పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సీసీలు వ్యవహరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం

ఏలూరు (టూటౌన్): సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదించడంపై ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు, జిల్లా ఇన్‌చార్జ్ కాశీ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు అనేక ఒడిదుడుకులు ఎదురొడ్డి నిరంతర ఉద్యమ పోరాటాలు చేసిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అయినపర్తి మాధవ రావు, బయ్యారపు కుటుంబరావు, దుగ్గిపోగు బాబురావు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం వాస్తవం కాదు

ఉంగుటూరు: కాగుపాడు పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఆ గ్రామ సర్పంచి కడియాల సుదీప్త ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఎటువంటి నిధుల దుర్వినియోగానికి పాల్పడలేదని స్పష్టం చేశారు. గ్రామంలో తాను చేసిన మంచి పనులకు పేరు వస్తుండడాన్ని సహించలేక రాజకీయ దురుద్దేశంతో కొందరు నాయకులు కక్షపూరిత ధోరణితో ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. త్వరలోనే వీటికి సరైన సమాధానంగా డీఎల్‌పీవోకి వివరణ ఇస్తామని సుదీప్త వివరించారు.

నేటినుంచి వర్జీనియా కొనుగోళ్లు

ప్రారంభ ధర రూ.330
ఉండాలంటున్న రైతులు



కొయ్యలగూడెంలోని పొగాకు కొనుగోలు ప్లాట్ ఫామ్

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్లు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పొగాకు రైతులు కొనుగోళ్ల తీరుపై కోటి ఆశలతో ఉన్నారు. గత ఏడాది మద్దతు ధర లభించడంతో రైతులు ఈ సీజన్లో కూడా కొనుగోలు అదేవిధంగా ఉండాలని కోరుకుంటున్నారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో 2,708 రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా వారు 3,138 బేరన్లను కలిగి ఉన్నారు. 6,017 హెక్టార్లలో సాగు చేస్తుండడంతో ఈ దఫా ఉత్పత్తి అధికంగా ఉండగలదని బోర్డు అధికారులు భావిస్తున్నారు. వేలం కొనుగోలు కేంద్రమైన కొయ్యలగూడెం (30)కి వచ్చి 12.94 మిలియన్ల కేజీల పొగాకు అనుమతి ఇవ్వగా 18.01 మిలియన్ల కేజీల పొగాకు ఉత్పత్తి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గత సీజన్లో రికార్డు ధర పలికిన పొగాకు కొనుగోళ్లు చూసి ఉత్పత్తి సైతం అదే విధంగా పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు.

అమాంతం పెరిగిన ఖర్చులు

గత ఏడాది పొగాకుకు మంచి ధర పలకడంతో ఈ ఏడాది రైతులు ఎక్కువగా పొగాకు సాగుపై ఆసక్తి చూపారు. దీంతో సాగు ఖర్చులు అమాంతం పెరిగాయి. సరాసరి ఎకరం కౌలు ధర రూ.80 వేలకు చేరిందని, అదేవిధంగా కూలీల ఖర్చులు, ఉత్పత్తి, బేరన్ క్యూరింగ్‌ల నిర్వహణ సైతం 30 శాతం పెరిగిందని రైతులు చెబుతున్నారు. తాము ఆశిస్తున్నట్లుగా ధరలు ఉంటే సరేసరి, లేదంటే నష్టాలను ఎదుర్కోక తప్పదని ఆందోళన చెందుతున్నారు. ప్రారంభ రోజున సీతంపేట క్లస్టర్‌కి చెందిన 36 బేళ్లను రైతులు విక్రయంలో ఉంచనున్నారు.

ముఖాముఖి చర్చలు



వర్జీనియా పొగాకు వేలం కొనుగోలు ప్రారంభం రోజున ముఖ్య అతిథులుగా బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ (ఐఏఎస్), ఈడీ బి.విశ్వశ్రీ(ఐఏఎస్)లను ఆహ్వానించాము. ఉన్నతాధికారులు రైతులతో ముఖాముఖి చర్చలు నిర్వహించనున్నారు.

– వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్, కొయ్యలగూడెం

గిట్టుబాటు ధర ఇవ్వాలి



కేజీ నాణ్యమైన పొగాకు ధర 330 రూపాయలతో ప్రారంభం కావాలి. అదేవిధంగా లోగ్రేడ్ పొగాకు రెండు వందల రూపాయలు తక్కువ కాకుండా కొనుగోళ్లు జరిగితేనే రైతుకు గిట్టుబాటు ధర లభించగలదు.

– కాకర్ల నంది, వర్జీనియా పొగాకు వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు, దిప్పకాయలపాడు

భగవద్గీత గ్రంథాల పంపిణీ



భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం పైడిపాక గ్రామంలో భగవద్గీత గ్రంథాలు ఆదివారం పంపిణీ చేశారు. మూలెం వెంకన్నబాబు ప్రోద్బలంతో కర్రి బాలకృష్ణ కుమార్తె కర్రి శ్రీలక్ష్మి భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. అలాగే భగవద్గీత గురించి భక్తులకు ఆమె తెలియజేసి పారాయణ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో గునపర్తి చంద్రావతి, మిరియాల నాగమణి, గునపర్తి హేమలతాదేవి, కర్రి వీరలక్ష్మి, గునపర్తి దేవి పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సహాయం

కొయ్యలగూడెం: ప్రమాదంలో గాయాలపాలై అనారోగ్యానికి గురై మంచం పట్టిన పొంగుటూరు గ్రామానికి చెందిన చేపల సుబ్బారావుకు మానవత సంస్థ ద్వారా ఆదివారం రూ.4 వేల ఆర్థిక సహాయం అందించారు. మానవత అధ్యక్షుడు మాటూరు సుధీర్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నిడదవోలు రామారావు, తిగిరిపల్లి చంటి, బొమ్మ మోహనరావు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

పోలవరం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 25 వరకు బుట్టాయగూడెం పోలవరం మండల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం పోలవరానికి చేరుకుంది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం బస్టాండ్ సెంటర్ వద్ద సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అమలు కానీ హామీలు ఇచ్చారన్నారు. జీఓ నంబర్ 3కి చట్ట భద్రత కల్పించాలని, ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. యాత్రలో సీపీఎం మండల నాయకులు బొరగం భూచంద్రరావు, పోలోజు నాగేశ్వరావు, చుంద్రు బుల్లెమ్మ, ఎస్.సాయికృష్ణ, గోకూరి పాండవులు, కె.భీమరాజు, అనూష, రాజు తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో సీపీఎం ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

• సందడే సందడి



పార్క్‌లో సందడి చేస్తున్న భక్తులు, పిల్లలు

శ్రీవారి కొండపైన చిల్డ్రన్స్ పార్క్‌లో సందడి నెలకొంది. పిల్లల ఆటలతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవుదినం కావడంతో క్షేత్రానికి వేలాది మంది భక్తులు విచ్చేశారు. స్వామివారి దర్శనానంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు తమ పిల్లలతో సమీపంలోని చిల్డ్రన్స్ పార్క్‌లోకి చేరుకున్నారు. చెట్ల నీడలో చిన్నారులు సాయంత్రం వరకు ఆటలాడుతూ కేరింతలు కొట్టారు. ఉయ్యాల ఊగటం, జారుడు బల్లలు జారడం, బాతు బొమ్మలు ఎక్కి తిరగడం, టైరు పట్టుకుని వేలాడటం వంటి ఆటలతో ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. తల్లిదండ్రులు దగ్గరుండి మరీ ఆటలాడించారు. సాయంత్రం వరకు భక్తుల పిల్లలతో సందడిగా మారిన పార్క్, ఆ తరువాత స్థానికుల పిల్లలతో కళకళలాడింది.

ద్వారకాతిరుమల

కోడిగూడెంలో సమస్యల తిష్ట

• అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
• వీధి లైట్లు లేక ప్రజల అవస్థలు
• పట్టించుకునే నాధుడు లేడంటూ ధ్వజం

ద్వారకాతిరుమల: మండలంలోని కోడిగూడెం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ముఖ్యంగా ఎస్సీ కాలనీ కంపు కొడుతోంది. దానికి తోడు వీధిరోడ్లకు ఇరువైపులా దట్టంగా పొదలు పెరిగిపోయాయి. కొన్ని చోట్ల వీధి లైట్లు లేవు. ఉన్న లైట్లూ సరిగ్గా వెలగడం లేదు. దాంతో విషసర్పాల బెడద ఎక్కువైందని, చీకటి పడితే బయటకు రావాలంటేనే భయమేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని, తమ సమస్యలు వినే నాధుడే లేడని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందని కొందరు అంటున్నారు. డ్రెయినేజీలు లేకపోవడంతో పలువురు ఇళ్లవద్దే ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని వాడుక నీటిని అందులోకి మళ్లిస్తున్నారు. మరి కొందరు కచ్చా డ్రెయినేజీల ద్వారా నీటిని రోడ్డు పక్కనుంచే పారేలా చేస్తున్నారు. మురుగు నిలిచిపోతే కర్రలతో నెట్టుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మరీ అధ్వానంగా ఉంది.

ప్రధాన రహదారి పక్కనా ఇదే దుస్థితి

గ్రామ ప్రధాన రహదారి పక్కనా ఇదే దుస్థితి కనిపిస్తోంది. బోదెల్లో ఏర్పాటు చేసిన తూరలు పూడుకుపోయాయి. దాంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి, తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే దోమల బెడద ఎక్కువైందని స్థానికులు అంటున్నారు. పంచాయతీ అధికారులు బ్లీచింగ్ చల్లి మమా అనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కోరుతున్నారు.



వీధిలైట్లు లేని విద్యుత్ స్తంభాలు



మంగలి పుంత వీధి రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పొదలు



వసంత్ కాలనీలో నిలిచిన మురుగును కర్రతో నెడుతున్న స్థానికుడు

ఎవరూ పట్టించుకోవట్లేదు



డ్రెయినేజీలు లేవు. మురుగు పారే వీలు లేదు. దాంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. కొందరు ఇళ్లవద్ద ఇంకుడు గుంతలు తవ్వుకున్నారు. మిగిలిన వాళ్లు రోడ్డు పక్కల నుంచే నీటిని విడిచిపెడుతున్నారు. దీని వల్ల దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది.

– మానుకొండ గంగారత్నం, గ్రామస్తురాలు

విష సర్పాల బెడద



మంగలిపుంత రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పొదలు పెరిగాయి. ఆ ప్రాంతంలో కనీసం వీధి లైట్లు లేవు. దాంతో విష సర్పాల బెడద ఎక్కువైంది. మేము సొంతంగా డ్రెయినేజీని నిర్మించుకున్నాం. కనీసం దాన్ని పూడిక తీయడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ, వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా ఉంది.

– పెట్ల మేరీ, కోడిగూడెం

భగత్‌సింగ్ పోరాటం.. యువతకు ఆదర్శం

ఘనంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి



జంగారెడ్డిగూడెం: భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: సీపీఐ కార్యాలయంలో అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో అవసరమని ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు అన్నారు. షహీద్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని జంగారెడ్డిగూడెంలో ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచిలి రాజు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి అశువులు బాసిన మహనీయులు అని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని రమణ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పటి దాసు, తానిగడప వెంకటేష్, కొత్తూరు అప్పుడు, పింగళి బ్రహ్మయ్య, దోసూరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు, చిలంతరాజుల శ్రీను, జగన్నాథ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కాగడాల ప్రదర్శన నిర్వహించి త్యాగధనులను కీర్తించారు.

అమరవీరుల త్యాగం.. మన స్వాతంత్య్రం

కొయ్యలగూడెం: అమరవీరుల త్యాగంతోనే స్వాతంత్య్రం సిద్ధించి నేడు మనం స్వేచ్ఛ వాయువులు పీల్చగలుగుతున్నామని సీపీఐ మండల కన్వీనర్ టి.ఆంజనేయరాజు పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్, రాజుగురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. చిన్న వయసులోనే దేశం కోసం ఉరికొయ్యలను ముద్దాడి ప్రాణాలు అర్పించిన, అమరవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లన్నారు. వారి చిత్రపటాలకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో షేక్ బాజీ, వెలగల రామారావు, ఎస్ గిరి, మట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

బంజారా భజరంగీ భేరి ఆధ్వర్యంలో...

టి.నరసాపురం: బంజారా భజరంగీ భేరి ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో విప్లవవీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించి భరత మాత దాస్య విముక్తికై విప్లవ మార్గంలో పోరాడిన ఎర్ర సూర్యుడు భగత్ సింగ్ అని అన్నారు. ప్రేమకు చిహ్నంగా తాజ్ మహల్‌ను గుర్తించినట్లే, సెట్లేజ్ నది ఒడ్డున ఉన్న భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల సమాధి తేజ్ మహల్‌ను దేశభక్తి చిహ్నంగా భారత ప్రభుత్వం గుర్తింపు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జరభల రమేష్, భూక్యా రాములు, భూక్యా కృష్ణ, భూక్యా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

చింతలపూడి: భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశంలో పేట్రేగిపోతున్న మతోన్మాద శక్తులను అడ్డుకోవడం కోసం యువత సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి మామిళ్ళపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సభ తుర్లపాటి బాబు అధ్యక్షతన జరిగింది. ఏఐవైఎఫ్ జిల్లా కోకన్వీనర్ తర్లపాటి రాజు, యువజన సమైక్య నాయకులు వడ్డే రామారావు ,డోలా రాజేష్, రాజు బోయిన శ్రీను, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత ఉద్యమించాలి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నెహ్రూబొమ్మ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు.

దేశంలోని సమస్యలపై పోరాడాలి

పోలవరం రూరల్: భగత్‌సింగ్ స్ఫూర్తితో నేడు దేశంలో నెలకొన్న సమస్యలపై పోరాడాలని నవ యువ సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.మోహన్, మండల నాయకులు చదలశివ, మిడియం శ్రీను అన్నారు. రెడ్డినాగంపాలెం గ్రామంలో ఆదివారం నవ యువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాషా మాట్లాడుతూ నేడు దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తూ సమస్త రంగాలను •సమస్త సంపదలను సామ్రాజ్యవాదులకు, దేశంలోని కార్పొరేట్ సంస్థలకి దోచిపెడుతున్నారన్నారు. ఆ విధానాలకు వ్యతిరేకంగా యువత పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కుంజం రామారావు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ ఆశయాలు సాధించాలి

వేలేరుపాడు: స్థానిక అంబేద్కర్ సెంటర్ నందు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి యర్రా మధు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు కంగాల గంగరాజు, బంధం నాగేశ్వరరావు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లను స్ఫూర్తిగా తీసుకుని దోపిడి, అన్యాయాలు, అక్రమాలపై యువత పోరాడాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కట్టం రాంబాబు అధ్యక్షతన శ్రీరాంపురంలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. సిరికొండ రామారావు, కట్నం వీరాస్వామి మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని యువతకు పిలుపునిచ్చారు.



వేలేరుపాడు: భగత్ సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు



టి.నరసాపురం: కృష్ణాపురంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



చింతలపూడి: సీపీఐ కార్యాలయంలో భగత్ సింగ్‌కు జోహార్లు అర్పిస్తున్న దృశ్యం



బుట్టాయగూడెం: భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న న్యూడెమోక్రసీ నాయకుడు రాఘవ



పోలవరం రూరల్: భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న మోహన్